www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 18 ఫిబ్రవరి 2024

5

తూర్పుగోదావరి



వైసిపి మైనార్టీ అధికార ప్రతినిధిగా ఆరిఫ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తూర్పు గోదావరి జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలుపడ్డాయి. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ కార్యకర్తల కష్టాన్ని గుర్తించే నిజమైన నాయకుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కష్టపడే వారికి పార్టీలో సరైన గుర్తింపు ఎప్పటికీ ఉంటుందన్నారు. తన నియామకానికి సహకరించిన మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్ బాషా, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ పివి.మిథున్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్ రామ్, మంత్రి చెల్లుబోయిన వేణు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, జక్కంపూడి గణేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలపారు.

పంచాయతీలపైనే భారాలు..

- ఆర్థిక సంఘం నిధులతో నిర్వహణ
- జీతాలు, కరెంటు బిల్లులకు కేటాయింపు
- ఆందోళనలో సర్పంచులు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని గ్రామ పంచాయతీలు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్నాయి. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అనుసరిస్తున్న విధానాల ఫలితంగా పంచాయతీల హక్కులు ఒకొక్కటిగా ఆవిరౌతున్న విషయం విదితమే. మేజర్ పంచాయతీలకు కొంత మేర ఆదాయం ఉండటంతో కొంత ఊరట లభిస్తోంది. మైనర్ పంచాయతీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. జిల్లాలో 300 పంచాయతీలున్నాయి. ఏటా విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను కూడా అత్యవసర సమయంలో వాడుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీనిపై పాలకవర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గత కొన్నేళ్ల పంచాయతీల్లో కరెంటు బిల్లులు రూ.కోట్లలో బకాయిలు ఉన్న విషయం విదితమే. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ ప్రభుత్వం కరెంటు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తేవడం పరిపాటిగా మారింది. మరో వైపు గ్రీన్ అంబాసిడర్స్‌కు కేంద్ర ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకపోవడంతో ఆ భారం పంచాయతీలే భరించాలని ప్రభుత్వం తేల్చిచెబుతోంది. మరోవైపు వేసవి రానున్న నేపథ్యంలో తాగునీటి సమస్య పొంచి ఉంది. ఆర్థిక సంఘం నిధులతో ఏదైనా చేద్దామని ఆశించిన సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి ఆశించిన మేర సహకారం కరువైంది. గత నెలాఖరులో కేంద్ర ప్రభుత్వం ఆర్థికసంఘం నిధుల ద్వారా రూ.31.87 కోట్లకుపైగా నిధులు వచ్చాయి. వాటిని ఏదో ఒక మంచిపని కోసం వినియోగించుకోవాలనుకున్న పాలకవర్గాలకు ప్రభుత్వ పెద్దల ఆదేశాలు తలనొప్పిగా మారాయి. ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులు, పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలని ప్రభుత్వం పంచాయతీలపై ఒత్తిడి పెంచింది. ఇప్పటికే అనేక గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శుల మధ్య నిధుల విషయంపై దూరం పెరిగింది. ప్రభుత్వ ఆంక్షలతో కార్యదర్శులు మరింత ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. అనేక గ్రామాల్లో అత్యవసర సమయంలో చేసిన పనులకు రూ.లక్షల్లో బిల్లులు పేరుకుపోయాయి. పంచాయతీలకు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు వచ్చిన సమయంలో వివిధ పనులతోపాటు సభల ఏర్పాటుకు అప్పులు తెచ్చి పెట్టారు. ఇప్పుడు వచ్చిన నిధులతో ఆ అప్పులు తీరుద్దామంటే ఆంక్షలు అడ్డొచ్చాయి. ఇప్పటికే ట్రెజరీల్లో అనేక బిల్లులపై ఆంక్షలు విధించగా, మార్చిలో ఆర్థిక సంవత్సరం ముగింపు కావడం, సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తుండటం, పాలకవర్గాలు నిధుల వినియోగంపై కార్యదర్శులపై ఒత్తిడి పెంచుతుండటంతో వారు కొట్టుమిట్టాడుతున్నారు.

పేదల సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేదల సొంతింటి కల సాకారం చేయడం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, ఎంపీ భరత్ రామ్ అన్నారు. శనివారం రూరల్ హుకుంపేటలో టిడ్కో డి బ్లాక్ గృహాలను లబ్ధిదారులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్ మాట్లాడుతూ లబ్ధిదారుల ముఖాలలో ఆనందం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు పైబడుతున్నా నేటికీ సొంతిల్లు లేని పేదలెందరో ఉన్నారని, ఇది చాలా విచారకరమని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలనే తపనతో సిఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మిస్తూ కొత్త ఊళ్ళనే సృష్టిస్తున్నారన్నారు. కొన్ని చోట్ల సాంకేతిక ఇబ్బందులు, మరికొన్ని చోట్ల ప్రతిపక్ష టిడిపి సృష్టించిన అడ్డంకులు అధిగమిస్తూ ఇళ్ళ స్థలాలు ఇవ్వడానికి సర్వం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సత్యవేణి, భవానీ ప్రియ పాల్గొన్నారు.


విధుల్లో చేరిన స్పెషలిస్ట్ వైద్యులు

జిఎంసిలో స్పెషలిస్టుల నియామకం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం నలుగురు సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించినట్టు జిఎంసి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యా ప్రభ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్య కాలేజీలో వారు ఇప్పటికే విధుల్లో చేరారని తెలిపారు. వీరు ఔట్ పేషంట్ విభాగంలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. సర్జికల్ ఆంకాలజీ సహాయ ప్రొఫెసర్ డాక్టర్ స్వామిరాజా, న్యూరాలజీ సహాయ ప్రొఫెసర్ డాక్టర్ సాయి నీలిమ, న్యూరో సర్జరీ సహాయ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ బాబు కలికివాయి, డాక్టర్ పాతూరి కిషోర్ విధుల్లో చేరారని తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిబద్ధత ఉండాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల విధుల్లో నిబద్ధతతో వ్యవహరించాలని కలెక్టర్ మాధవీలత, ఎస్పి పి.జగదీష్, జెసి తేజ్ భరత్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక జిఎస్ఎల్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, మీడియా సర్టిఫికేషన్, పర్యవేక్షణ కమిటీ, సివిజిల్, ఎన్నికల నిర్బంధ నిర్వహణా వ్యవస్థ బృందాల అధికారుల శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. పోటీలో నిలబడే అభ్యర్థులు చేసే ఖర్చులు, ప్రచారం, ర్యాలీలు తదితర విభాగాల వారీగా ప్రత్యేక పర్యవేక్షణ చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు అభ్యర్థులు చేసే ఖర్చులకు సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించడం, వాటిని నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి విషయంలో రాజకీయ పార్టీలు, పోటీలో నిలబడే అభ్యర్థులు ఖచ్చితంగా నియమావళి ఉల్లంఘన చెయ్యకుండా పర్యవేక్షణ చేయాలని, వాటిని వీడియో రికార్డింగ్ కోసం ప్రత్యేక బృందాలు విధులను నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఫ్లయింగ్, గణాంక, వీడియో సర్వైవల్ బృందాలు విధులను అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. ఎస్పి పి.జగదీష్ మాట్లడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నియమావళిని ఖచ్చితంగా పాటించడంలో వివిధ బాధ్యతలు నిర్వహించే అధికారులు ఎటువంటి సందేహాలు వొచ్చిన వెంటనే నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్ఒలు, ఇఆర్ఒలు పాల్గొన్నారు.

బిజెపిని వ్యతిరేకించే పార్టీలకు మద్దతు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్, నాయకులు

దేశంలో ఆర్థిక, సామాజిక ప్రమాదకర విధానాలను అవలంబిస్తున్న బిజెపిని వ్యతిరేకించే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో జతకట్టిన పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అరుణ్ మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులను కాలరాసిందన్నారు. దళితులు మైనార్టీలపై ఆర్‌ఎస్ఎస్ దాడులు పెరిగాయన్నారు. ప్రజాస్వామ్యయుతంగా సాగుతున్న రైతుల ఉద్యమంపై పిల్లెట్లు ప్రయోగించడం బిజెపి దుర్మార్గ వైఖరికి దర్పణం పడుతుందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి హక్కులను హరించిందనిన్నారు. అంతర్జాతీయంగా గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గినప్పటికీ దేశంలో ధరలు తగ్గించలేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు సేవ చేయటమే లక్ష్యంగా బిజెపి పాలన సాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో మోడీని గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు మోడీ విధానాలకు మద్దతు తెలిపి రాష్ట్రానికి ద్రోహం చేశాయన్నారు. 20న విజయవాడలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మినహా మిగిలిన పార్టీలన్నీ కార్పొరేట్ల నుంచి రూ.కోట్ల ఎలక్టోరల్ బ్యాండ్లను తీసుకున్నాయని తెలిపారు. తమ పార్టీ ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తుందని 19వ తేదీ నుంచి జరగబోయే ప్రజా నిధి సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీ భరత్ రామ్ నగరాభివృద్ధికి వెచ్చించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని అరుణ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.125 కోట్లు విడుదల చేసినట్టు చెబుతున్నారని ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలన్నారు. కంబాల చెరువు ఆధునీకరణ పేరుతో రూ.9.18 కోట్లు వెచ్చించారని, దీనిలో రూ.2 కోట్లు మాత్రమే రుడా నిధులని, మిగిలినవన్నీ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ అని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా నాయకులు ఎస్ఎస్.మూర్తి పాల్గొన్నారు.

'ఎడెక్స్'తో ఒప్పందాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎడెక్స్ సంస్థతో ఉన్నత విద్యలో ఆన్‌లైన్ కోర్సుల ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాల ముసుగులో ప్రభుత్వ విద్యారంగంలో ప్రయివేటు సంస్థల జోక్యం, ఆన్‌లైన్ కోర్సుల విధానం తీసుకురావడం వల్ల ప్రభుత్వ విద్యా రంగానికి నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిగ్రీ చేరే విద్యార్థుల సంఖ్య లక్ష మందికి పడిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేసి, అధ్యాపకులను నియమించి డిగ్రీ విద్యను వాటి ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలి కానీ ఆన్‌లైన్ కోర్సుల పేరుతో ఒప్పందం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ విద్యను నీరుగార్చి, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించేందుకేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రూ.వందల కోట్లు ముట్టచెప్పిన బైజూస్ ఒప్పందం వల్ల విద్యార్థులకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు.

ఇళ్ల స్థలాల కోసం మహిళల ధర్నా

ప్రజాశక్తి-కడియం


ధర్నా చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న తహశీల్దారు

వేమగిరిలోని జగనన్న లే ఔట్-3లో పట్టాలిచ్చిన సుమారు 300 మంది మహిళా లబ్ధిదారులు తమకు స్థలాలు చూపించట్లేదని తహశీల్దారు కార్యాలయం వద్ద శనివారం ధర్నాకు దిగారు. ఈ ధర్నాతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. వేమగిరి గ్రామానికి చెందిన లబ్ధిదారు సిహెచ్.లక్ష్మి మాట్లాడుతూ వేమగిరి గ్రామానికి సంబంధించి సుమారు 706 మంది లబ్ధిదారులకు, కడియపు సావరం గ్రామానికి సంబంధించి సుమారు 121 మంది లబ్ధిదారులకు గతంలోనే పట్టాలు ఇచ్చారని చెప్పారు. కానీ స్థలాలు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కడియం మండలంలో కొన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారులకుకూడా ఇదే ప్రాంతంలో గతంలోనే పట్టాలతో పాటు స్థలాలకు కూడా చూపించారని, వారు పక్కా ఇళ్లు నిర్మించుకున్నారన్నారని చెప్పారు. తక్షణమే అధికారులు, నాయకులు స్పందించాలని లేకుంటే రాబోవు రోజుల్లో ప్రజలు మద్దత్తుతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు స్పష్టం చేశారు. దీంతో కడియం తహసీల్దార్ రమాదేవి అక్కడికి ఇచ్చి వారితో మాట్లాడారు. ఈ లే ఔట్ స్థలానికి సంబంధించి న్యాయస్థానంలో స్టేటస్ కో ఉందని తెలిపారు. ఎవరైనా ఐదుగురు లబ్ధిదారులు వస్తే కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి మాట్లాడిస్తానని సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని చెప్పడంతో ధర్నా నిలుపదల చేసి కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు.

వైసిపి టౌన్ కన్వీనర్‌గా వీర్ల వెంకటేష్

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి గోకవరం టౌన్ కన్వీనర్‌గా వీర్ల వెంకటేష్ నియమితులయ్యారు. పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్టు తోట రామ్‌జీ తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. వీర్ల వెంకటేష్ మాట్లాడుతూ గోకవరం టౌన్ బాధ్యతలను అప్పగించిన తోట నరసింహం, సహకరిస్తున్న నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతతో నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరసాల ప్రసాద్, మండల వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, పాటి రాంబాబు, గోకవరం సొసైటీ అధ్యక్షుడు దాసరి చినబాబు, సమ్మెట నాని, కర్రి సూరారెడ్డి, అక్షింతల రాజా, దాసరి సీతబాబు, నరాలశెట్టి నరసయ్య, తంటికొండ సర్పంచ్ బదిరెడ్డి సత్యనారాయణమ్మ, అచ్యుతాపురం సర్పంచ్ బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్బంధంపై ఉద్యోగుల ఆందోళన

ఉద్యోగులను పోలీసులు శనివారం పలుచోట్ల నిర్బంధించారు. తమ సమస్యలపై పోరాడుతున్న వారిని నిర్బంధించడంపై ఉద్యోగులు పలుచోట్ల నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం డిమాండ్ల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎపి జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత వారు నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఎపిజెఎసి ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాలను చేపట్టామని నాయకులు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, నాయకులు, మహిళ ఉద్యోగులు ,పెన్షనర్లు పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో జెఎసి ఉద్యోగుల నిరసన


తాళ్లపూడిలో పోలీసులు ఉండగా విద్యా బోధన

ఈ కార్యక్రమంలో ఎపిజెఎసి జిల్లా చైర్మన్ వైవివి.సుబ్బారావునాయుడు మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన ఎస్ఎల్, జిపిఎఫ్ రుణాలు, ఎపిజిఎల్ఐ, డిఎ బకాయిలు, వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శి సేవా ప్రవీణ్ కుమార్, ఎపి జెఎసి రాష్ట్ర కార్యదర్శి డి.వేణుమాధవరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు రమేష్, రవిబాబు, పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కెజికె.మూర్తి, కార్యదర్శి పార్వతి, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కె.సంజీవరావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, డిఇసి మెంబర్ ఎంఎస్ఎన్.రాజు, మహిళా విభాగం అధ్యక్షులు పి.కామేశ్వరి, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎపి జెఎసి ధవళేశ్వరం కన్వీనర్ ఎస్.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రాజబాబు ఆధ్వర్యంలో ఇరిగేషన్ సర్కిల్ ఆఫీస్ వద్ద నుంచి బ్యారేజ్ సెంటర్ వద్ద గల కాటన్ విగ్రహం వరకూ 100 మంది ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి నడిపిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యాచరణలో భాగంగా 20వ తేదీన కాకినాడలో నిర్వహించే ఉద్యోగుల ధర్నా, ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని ఇచ్చారు. ఈ ర్యాలీలో ఎన్‌జిఒ సంఘం నాయకులు బి.లక్ష్మణుడు, ఎన్.గౌరీశంకర్, పి.శేషుకుమార్, ఎస్.సత్తిరాజు, ఆదిత్య, ఎం.సతీష్, సయ్యద్ బాజీ, ఎస్.వాసుదేవి, ఎ.సాయిరాం, ఎం.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వరరావు, డి.కృపారావు, రామభద్రరావు, బి.శ్రీను, విక్రమ్ పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు పోలీసుల నోటీసులు

పాత పెన్షన్ సాధనకై సిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం కు వెళ్ళకూడదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబుకు బొమ్మూరు పోలీసు వారు రాత్రి 12 గంటల సమయంలో నోటీసులు అందజేసి


రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద నిరసన

అందజేశారు

తాళ్లపూడి ఓట్ ఫర్ ఒపిఎస్ కోసం ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయులు నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని నోటీసులు గృహనిర్బంధాలతో ఆపలేరని ఒపిఎస్ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు, ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు దున్నా దుర్గారావు స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు మండలంలోని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నోటీసులు ఇచ్చారు. ఆయా ఆఫీసుల వద్ద, నాయకుల గృహాల వద్ద పహారా కాశారు. ఉపాధ్యాయ నాయకుడు దుర్గారావు పోలీసుల పర్యవేక్షణలోనే శనివారం పాఠశాలలో విద్యాభోధన కొనసాగించారు.

చాగల్లు ఎపిసిపిఎస్ సంఘం ఆదివారం విజయవాడలో తలపెట్టిన ఓట్ ఫర్ ఒపిఎస్ ధర్నాకు యూనియన్ నాయకులు ఎవరూ హాజరు కారాదని మండలంలోని యుటిఎఫ్ ముఖ్య నాయకులందరికీ ముందస్తుగా పోలీసులు నోటీసులు అందించడాన్ని యుటిఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. నాయకులు పట్టా రవివర్మ, టి.నారాయణరావు, జె.రాజశేఖర్, వై.నాగరాజుకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి నోటీసుల అందజేతను తీవ్రంగా ఖండించారు.

కార్టూ'నిజం'



అందరికీ టిక్కెట్లు ఇవ్వడం కుదర్దయ్యా..
కావాలంటే.. రాజధాని ఫైల్స్
సినిమా టిక్కెట్స్ ఇస్తార్ట..!!



నర్సరీని సందర్శించిన విద్యార్థినులు

సత్యదేవా నర్సరీలో విద్యార్థులు

ప్రజాశక్తి-కడియం

కడియపులంక శ్రీసత్యదేవా నర్సరీని, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల బోటనీ విద్యార్థులుచ, ఉపాధ్యాయులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కడియం మండల వ్యవసాయ అధికారి కె.ద్వారకాదేవి, ఉద్యాన అధికారి డి.సుధీరకుమార్ మాట్లాడారు. దేశ, విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ప్రదేశం కడియం ప్రాంతం అన్నారు. తమ కళాశాలలు ఏర్పాటు చేసే విజ్ఞాన పర్యటనల్లో తప్పనిసరిగా కడియం ప్రాంతాన్ని ఎప్పుడూ ఎంచుకుంటారని వారు పేర్కొన్నారు. ఈ నర్సరీలో ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల మొక్కల వివరాలను మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా పెద్ద సత్యనారాయణను విద్యార్థినులు అడిగి తెలుసుకుని, కొన్ని రకాలు మొక్కలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.సంతోషి, జాస్మిన్, లక్ష్మీ ప్రమీల పాల్గొన్నారు.


బీరువా అందిస్తున్న శ్రావ్య

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

విద్యార్థులు అంగన్వాడీ చిన్నారుల అవసరాలు తెలుసుకుని దాతలు సహకరించడం ఎంతో అభినందనీయమని అంగన్‌వాడీ సూపర్వైజర్ భాగ్య కుమారి అన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న నందన ఫౌండేషన్ ప్రతినిధి రవి తన కుమార్తె శ్రావ్య పుట్టినరోజు సందర్భంగా ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోని పైడిమెట్టలో అంగన్వాడీ కేంద్రానికి శనివారం ఇనుప బీరువా బహూకరించారు. ఈ కార్యక్రమంలో నందన ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, ఆలీ అంగన్వాడి టీచర్ రాజేశ్వరి, ఆయా కుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పేస్కేల్ పెంచాలని విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామ రెవెన్యూ సహాయకులకు తెలంగాణ తరహా పేస్కేల్ అమలు చేయాలని తహశీల్దారుకు విఆర్ఎలు శనివారం వినతిపత్రం ఇచ్చారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు 2018 నుంచి రికవరీ చేసిన డిఎ బకాయిలను తిరిగి చెల్లించేందుకు, నామినీలను విఆర్ఎలుగా గుర్తించేందుకు అర్హులైన వారికి ప్రమోషన్స్, తదితర సమస్యలను పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్నట్లు మండల విఆర్ఎల కార్యదర్శి తిపర్తి నాగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో రూ.15 వేల జీతం చెల్లిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు శంకర్, రాజబాబు, కుమారి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న విఆర్ఎలు

నేరాలు ఘోరాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ,సామగ్రి

దొంగ నోట్ల ముఠా అరెస్ట్

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

రూ.75 వేల నకిలీ కరెన్సీ స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

దొంగనోట్లను ముద్రించి చలామణి చేస్తున్న ముఠాను రామచంద్రపురం పోలీసులు శనివారం పట్టుకున్నారు. పక్కా సమచారంతో దాడి చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.75వేల విలువ చేసే నకిలీ నోట్లోను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను డిఎస్‌పి బి.రామకృష్ణ మీడియాకు వివరించారు. వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో మొగంటి గోపి, బోయి గోవిందరాజు, వాసంశెట్టి వీరభద్ర రఘురాం, బాడుగంటి వీర వెంకటరమణ నకిలీ నోట్లు ముద్రణ ప్రారంభించారని తెలిపారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న మరో ఇరువురు చల్లా నూకారెడ్డి, మీసాల అప్పల రాజు పరారీలో ఉన్నారని తెలిపారు. త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని వివరించారు. నిందితుల వద్ద నకిలీ నగదుతో పాటు ప్రింటర్, పెన్ డ్రైవ్ ల్యాప్‌టాప్, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సిఐ ధర్మరాజు, ఎస్‌ఐ సురేష్‌బాబులను ఎస్‌పి అభినందించారని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం



వరలక్ష్మి(ఫైల్)

మండలంలోని ద్రాక్షారామం బియ్యంపేటలో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బియ్యంపేటకు చెందిన దొంగల వరలక్ష్మి(30) కన్పించట్లేదని ఈనెల 14న భర్త దొంగల నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం ఒక బావిలో దుర్వాసన రవాడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బావిలో మృతదేహాన్ని బయటకు తీశారు మృతదేహం వరలక్ష్మిదిగా బంధువులు గుర్తించారు. మతురాలికి ఒక పాప ఉందని దీనిపై అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో విద్యుదాఘాతానికి గురై బ్రౌన్‌పేటకు చెందిన చెక్క ఆనంద్‌కుమార్(27) మృతి చెందాడు. ప్రయివేట్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న ఆనంద్‌కుమార్ విద్యుత్ స్తంభంపై పని చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. స్తంభం పైనుంచి కిందపడి మృతి చెందాడు. ఆనంద్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భిణిగా ఉంది. ప్రమాదం సమాచారంతో ట్రాన్స్‌కో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటకు చెందిన పోలీస్ ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. శనివారం విధి నిర్వహణలో భాగంగా మోటారు సైకిల్‌పై వెళుతున్న రాజ్‌కుమార్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడకు తరలించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని నందిగూడెంలో శనివారం అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసున్నట్టు ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. అతని నుంచి ఆరు బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తలిలపారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మకాల జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-కడియం

అద్దెకు వచ్చి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని కడియం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సిఐ బి.తులసీధర్ కడియం పోలీస్ స్టేషన్లో ఈ వివరాలను వెల్లడించారు. పెరవలి మండలం ఖండవల్లికి చెందిన పల్లెపు విజయ్‌కుమార్ కడియం మండలం వేమగిరిలో దొడ్డా ఉమాపార్వతి బంధువుల ఇంటిలో 3 నెలలు క్రితం అద్దెకు దిగాడు. ఉమా పార్వతి ఇంట్లోని సుమారు రూ.2లక్షల విలువైన బంగారు నగలను అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం నల్లమందు సందులో విజయ్‌కుమార్‌ను కడియం ఎస్‌ఐ బి.నాగదుర్గాప్రసాద్, కానిస్టేబుల్స్ శివ, రవి, కుమార్ అదుపులోనికి తీసుకున్నారు. నిందితుడు తరచూ ఊర్లు మారుతూ ఇంటి యజమానులు, చుట్టు పక్కల వారితో స్నేహం చేస్తూ, నమ్మకంగా ఉండి వారి ఇళ్లలో దొంగతనాలు చేస్తూ ఉంటాడని తెలిపారు. ఇతడిపై పలుప్రాంతాల్లో చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితుని రాజమహేంద్రవరం కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు వెల్లడించారు.

గ్రామీణ బంద్‌తో హెచ్చరిక

ఐక్యత చాటిన కర్షకులు, కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలతో కార్మికులు, కర్షకులు కేంద్రానికి హెచ్చరికలు చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు నేపథ్యంలో ఈ నెల 16న నిర్వహించిన గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెలో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. కార్మికులు, కర్షకుల ఐక్యతను మరోమారు చాటిచెప్పారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ర్యాలీలలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. కేంద్రంలో బిజెపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ల జపం పట్టింది. ప్రోత్సాహకాల పేరుతో వారికి పెద్దఎత్తున రాయితీలు కల్పించింది. దేశంలో అధిక సంఖ్యలో ప్రజలు ఉపాధి పొందుతున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అటకెక్కించింది. కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతాంగం అప్పుల ఊబిలో కూరకుపోయింది. గత సమ్మె కాలంలో ఇచ్చిని హామీలను సైతం పూర్తిగా వదిలేయడంతో కర్షకులు దేశవ్యాప్త బంద్‌లో పాల్గొని తమ వ్యతికేతను వెల్లబుచ్చారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటు సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టడంతో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువవుతోంది. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల లక్షలాది పరిశ్రమలు మూతబడ్డాయి. కోట్లాది మంది కార్మికులు వీధిన పడ్డారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు వివిధ ప్రజా సంఘాలు సైతం మద్దతు తెలిపి కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టాయి. స్కీమ్ వర్కర్లు సైతం బంద్‌లో పాల్గొని సంఘీభావం తెలిపారు.

అందరి చూపూ ఎన్నికల వైపే

సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఒక వైపు రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఇప్పటికే పొత్తులు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దాదాపుగా పూర్తి చేశాయి. అధికార పార్టీ అభ్యర్థులను సైతం ప్రకటించగా ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం, జనసేన కూటమి త్వరలోనే ప్రకటించే అవకాశాలున్నాయని ఆయా పార్టీల ముఖ్యనాయకులు చెబుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగమూ పూర్తిగా సంసిద్ధమవుతోంది. ఇప్పటికే ఓటర్ల జాబితా దాదాపుగా ఖరారు చేసిన విషయం విదితమే. అయితే ఇప్పటికీ దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉండటంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కొత్త ఓట్లను చేర్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఇంకో ఎన్నికల సిబ్బంది జాబితా తయారు చేయాలని ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేయటంతో అధికారులు ఆ దిశగా అడుగులు ప్రారంభించారు. ఈ కసరత్తు పూర్తయిన వెంటనే రోజుల వ్యవధిలోనే ఎన్నికల నగరా మోగే అవకాశం కనిపిస్తోంది.

పరీక్షల సీజన్

విద్యార్థుల్లో పరీక్షల ఫియర్ మొదలైంది. మార్చిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. మరో వైపు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈ ఏడాది పాఠ్యపుస్తకాలు సైతం ఇవ్వకుండా విద్యా సంవత్సరం పూర్తి చేయడంపై సర్వత్రా

గోదారి గలగలలు

విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో రెండేళ్లుగా జిల్లా పూర్తిగా వెనుకబడిన విషయం విదితమే. గత పరిస్థితుల నుంచి పాఠాలను తీసుకుని ఈ సారైనా మెరుగైన ఫలితాల దిశగా అడుగులు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్ఫూర్తి నింపిన బాలోత్సవం

తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో నిర్వహించిన బాలోత్సవం బాలలకు స్ఫూర్తినిచ్చింది. ఈ కార్యక్రమంలో సుమారు 165 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. 32 అంశాలో జరిగిన ఈ పోటీలలో 6 వేల మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు. మరో 5 వేల మంది ప్రేక్షకులు రావడంతో శ్రీ కందుకూరి విద్యా సంస్థల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ముగింపు సభకు జిల్లా ప్రముఖులు హాజరై ఈ ఒరవడి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని ఆకాంక్షన వెలిబుచ్చారు. తమ వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. చిన్నారుల ప్రతిభా పాఠవాలను కీర్తించారు. బహుమతులు అందజేశారు.



ఉద్యోగులతో సమీక్షిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

ఎన్నికల విధుల్లో అలసత్వం తగదు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఎన్నికల విధుల నిర్వహణలో ఏ ఒక్కరూ అలసత్వం వహించవద్దని సహాయ ఎన్నికల అధికారి, తహశీల్దారు సిహెచ్.శ్రీనివాసరావు సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణపై బిఎల్‌ఒలతో శనివారం తహశీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ మరణించిన వ్యక్తుల పేర్లు ఓటరు లిస్టులో లేకుండా చూడడంతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని సూచించారు. దినపత్రికల్లో వచ్చే వార్తలకు సరైన సమాధానం, సంబంధిత ఫారాలు జత చేసి ఎన్నికల కమిషన్‌కు సమాధానం ఇవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఒఎస్‌ఒ జోడాల, వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ కిషోర్, సీతారామరాజు, జూనియర్ అసిస్టెంట్ దీపక్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కన్నబాబు అభిమానులు

ఘనంగా కన్నబాబు పుట్టినరోజు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కృష్ణునిపాలెంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు పుట్టినరోజు వేడుకను అభిమానులు భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. సుమారు 38 మంది రక్తదానం చేశారు. జక్కంపూడి ఫౌండేషన్ ద్వారా బ్లడ్ సేకరించి రాజమహేంద్రవరం తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గునిపే భరత్, మండిగ గంగాధర్, గుండా శివప్రసాద్, దాసరి తరుణ్, బదిరెడ్డి రవి, సిద్ధ చంటి, మండిగా బాలాజీ, సురేష్, వాసు, సత్యనారాయణ, రాజు, చిట్టిబాబు, భగత్ సింగ్, సంపత్, తేజ, కామరాజు, అనిల్, పవన్,చందు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడియం

వార్షిక విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని కడియపులంక లోకల్ ఫీడర్లకు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. మండలం లోని కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, దోసాలమ్మ కాలనీకి విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ ఆసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జె.కొత్తూరులో టిడిపి ప్రచారం

జగ్గంపేట : మండలంలోని జె. కొత్తూరు గ్రామంలో శనివారం ఇంటింటికి టిడిపి ప్రచారం నిర్వహించారు. జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ తన తండ్రి జ్యోతుల నెహ్రూ తరపున ప్రచారంలో పాల్గొని ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ప్రజలు టిడిపిని ఆదరిస్తున్నారన్నారు. గత వారం రోజులుగా జగ్గంపేట నియోజకవర్గంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. చల్లా రామ్మూర్తి, ఉప సర్పంచ్ సైనం శ్రీను, అడపా తాతాజీ, కందుల విజయ్, కోర్పు సాయితేజ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకారం

జగ్గంపేట : రాబోయే ఎన్నికల నిర్వాహణలో అందరి సహకారం అవసరమని జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ పై రాజకీయ పార్టీ నేతలు, ఎన్నికల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. రాజకీయ పార్టీ నేతల సూచనలు సలహాలు తీసుకున్నారు. ఎన్నికల సిబ్బంది విధి నిర్వహణలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన వివరించారు.



44వ వార్డులో పర్యటిస్తున్న ఎంపీ భరత్

సేవలు నచ్చితే గెలిపించండి : ఎంపీ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎంపీగా తాను చేసిన సేవలు నచ్చితే ఎంఎల్‌ఏగా ఆశీర్వదించి గెలిపించాలని ఎంపీ, వైసిపి సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్గాని భరత్ రామ్ కోరారు. శనివారం నగరంలోని 44వ వార్డు పి అండ్ టి కాలనీ శ్రీనివాస్ కాన్వెంట్ సెంటర్ వద్ద నుంచి నిర్వహించిన 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంత వాసులతో, చిరు వ్యాపారులతో ముచ్చటించారు. స్థానిక సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఒకచోట పుంత రోడ్డు చివరిలో కాలువ ఉండటంతో రోడ్డుపైకి వెళ్ళేందుకు చాలా ఇబ్బందిగా ఉందని పలువురు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన ఆర్‌ఎంసి సిబ్బందిని పనులు చేపట్టాలని ఆదేశించారు. వార్డులో ఏ సమస్య ఉన్నా..ఎవరైనా సరే, పార్టీలను పక్కనబెట్టి ఫిర్యాదు చేస్తే తప్పక స్పందిస్తానని చెప్పారు. మోరంపూడి ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి మరో రెండు నెలల్లో పూర్తవుతుందని, పార్కులు, జంక్షన్స్, రోడ్లు, డివైడర్స్, పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. జాతీయ రహదారిపై మరో అయిదారు ఎఫ్‌ఒబిలు వస్తాయని, ఔటర్ రింగ్ రోడ్ రాబోతోందని చెప్పారు. రైల్వే స్టేషనులో 4, 5 ప్లాట్‌ఫారమ్స్ పూర్తయ్యాయని, 6వ ప్లాట్‌ఫారమ్ కూడా రానుందని తెలిపారు. మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, వైసిపి నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, క్లస్టర్ ఇన్‌ఛార్జి అప్పారావు, కొమ్మోజు జిగ్లర్, హసీనా బేగం, పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ భవనంలో గుర్రాల చందు స్టీఫెన్ అధ్యక్షతన జరిగిన పెద్దాపురం నియోజక వర్గ స్థాయి క్రిస్టియన్ మైనారిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అట్టడుగు, పేద, బలహీన, మైనారిటీ వర్గాల అభ్యున్నత కోసం, వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వైసిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్మానియేల్ రాజ్, క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు నండూరి కళ్యాణ్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, ఉబా జాన్ మోసెస్‌పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న తోట రామ్‌జీ

పలువురికి తోట రామ్‌జీ పరామర్శ

ప్రజాశక్తి -గోకవరం

ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి తోట నరసింహం తనయుడు రామ్‌జీ శనివారం పరామర్శించారు. రంపఎర్రంపాలెంకు చెందిన 10వ తరగతి విద్యార్థులు కాకర అర్జున్, లావేటి రామ్‌జీ, అండిబోయిన దేవి చరణ్ ఇటీవల ప్రమాదవశాత్తు సీతపల్లి వాగులో పడి మృతి చెందడంతో వారి కుటుంబాలను రామ్‌జీ పరామర్శించారు. పితృ వియోగంతో బాధ పడుతున్న ఉంగరాల ఆది విష్ణు కుటుంబాన్ని, తంటికొండ దేవస్థాన ధర్మకర్త పాటి సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. రామ్‌జీ వెంట వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, సమ్మెట మోహన్, బుజ్జి, బత్తుల శ్రీను, దంగేటి వెంకటరత్నం, దాకారపు ధర్మరాజు, తోట సత్యనారాయణ, దొడ్డ విజయ్, పాటి అప్పలరాజు, పాటి రాజా, కర్రి శివ రామకృష్ణ, టి.కాటమస్వామి, పి.రమణ కె.బుజ్జి, జి.రామకృష్ణ, గుప్తా తదితరులు ఉన్నారు.

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- గోకవరం

తంటికొండ శ్రీవెంకటేశ్వర స్వామి 64వ బ్రహోత్సవాలను శనివారం దేవస్థానం అభివద్ధి కమిటీ చైర్మన్ బదిరెడ్డి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం తనయుడు రామ్‌జీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కర్రి సూరారెడ్డి, గుబ్బలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ నరాలశెట్టి నరసయ్య, పల్లెల నాగబాబు, సింబోతుల శ్రీను, అర్చకులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రాజానగరం : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో పుణ్యక్షేత్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాపాక ప్రసాద్ (36)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఏడాది కాలంగా భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు ప్రసాద్ అత్తవారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. పంటపొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గుర్తించి వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాతాలో డబ్బులు కాజేశారని ఫిర్యాదు

సీతానగరం : బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు కాజేసారని వంగలపూడికి చెందిన తిగిరిపల్లి మార్తమ్మ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త మరణంతో మార్తమ్మ వంగలపూడిలో ఒంటరిగా నివసిస్తోంది. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం ప్రభుత్వ సచివాలయం చుట్టూ ఏడాదికాలంగా తిరుగుతోంది. ఈ క్రమంలో నాలుగు రోజుల సర్పంచ్ తనకు ఆర్థిక సాయం వచ్చిందని, బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం డబ్బులు జమ చేసినట్టు చెప్పారన్నారు. దీంతో బ్యాంకులో వాకబు చేయగా డబ్బులు జమ అయ్యాయని, గతేడాది జూన్ 24 నుంచి ఆగస్టు 1వ తేదీల మధ్య సుమారు రూ.1.80 వేలను ఎటిఎం ద్వారా డ్రా చేసినట్టు చెప్పారన్నారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

తాళ్లరేవు : లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పన్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా పలువురు పేదలకు ఉచితంగా భోజన క్యారేజీలు అందించారు. లైన్స్ క్లబ్ ద్వారా ఈ పథకం ప్రారంభమై 413 రోజులు అయిందని జడ్‌సి బిళ్ళకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం అన్నదాత కొత్త రాజకుమార్, రత్నకుమారి దంపతుల ఏకైక కుమార్తె డాక్టర్ అనూష, నారాయణమూర్తిలను అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ వై.లక్ష్మి శనివారం తెలి పారు. తూరంగి-3 ఎస్‌సి, రమణ య్యపేట-3 ఒసి జనరల్ కేటగి రీలకు కేటాయించారన్నారు. దర ఖాస్తులు చేసుకునే అభ్యర్థినులు స్థానిక వార్డుకు చెందిన వివాహిత మహిళై ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 2023 జులై 1 నాటికి 21 ఏళ్లు నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు కాకినాడ రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖా స్తులను 22వ తేదీ 5 గంటలలోపు అందిం చాలన్నారు. సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు.

రుద్రాభిషేకానికి చంద్రబాబుకు ఆహ్వానం

జగ్గంపేట : ఈ నెల 26 నుంచి మార్చి 7 వరకు మండలంలోని ఇర్రిపాక గ్రామంలో జరిగే కోటి పార్థివ లింగ రుద్రాభిషేకం కారక్రమానికి మాజీ సిఎం చంద్రబాబు నాయుడుకి ఆహ్వానం పలికారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ శనివారం అమరావతిలో చంద్ర బాబుని కలిసి ఆహ్వానపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ తమ స్వగ్రామం ఇర్రిపాకలో నిర్వహించే కోటి పార్థివలింగాలతో కోటి పార్థివలింగ రుద్రాభిషేకం కార్య క్రమానికి చంద్రబాబుకు ఆహ్వాన పత్రం అందిస్తామన్నారు.

IN THE COURT OF THE 4th ADDITIONAL DISTRICT JUDGE :: KAKINADA

G.O.P. No. 97 / 2023

(In the matter of custody of the minor and property belonging to Appalabathula Gowri Lakshmi Naga Rama Surekha, aged 14 years (DOB 19-04-2009), D/o. Appalabathula Ganesh, being minors represented by her mother and natural guardian, Appalabathula Swathi, W/o. Appalabathula Ganesh, R/o. D.No.31-1-24, Rangayyanaidu Street, Suryanarayanapuram, Kakinada,Kakinada Urban Mandal)

Between:

Appalabathula Swathi ...Petitioner

and

Nil ...Resondent

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ గారి కుమార్తె Appalabathula Gowri Lakshmi Naga Rama Surekha మైనరు అయినందున పిటిషనర్ Appalabathula Swathi గార్డియన్ అయి ఉండి, సదరు మైనరు కుమార్తె చదవు మరియు ఇతర ఖర్చుల నిమిత్తం ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిలో 1/2వ వంతు ఆస్థిని అమ్ముట కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఈ క్రింది తెల్పిన ఆస్థి విక్రయం గురించి ఎవరికైనా, ఏ విధమైన ఆక్షేపణలు లేదా అభ్యంతరములు ఉన్న యెడల ది.**26-02-2024** తేదీకి పైన తెల్పిన కోర్టులో ఉదయం **10.30** ని॥లకు హాజరయి ఆక్షేపణలు తెలియ జేయవలెను.

SCHEDULE: East Godavari District, Kakinada Urban Mandal, Kakinada Sub-Registrar area in Kakinada Municipal Corporation area, Ward No.1, Block No.64, Kakinada, S.Atchutapuram, T.S. No.96/1, in total an extent of 270 sq.yds. in laid out into construct a Apartment divided as Flats the Name and style of PRIYANKA'S GRUHA APARTMENT, 1st Floor, D.No.64-11-1A/B4, Assessment No.1060023544, Flat No.B.4 that is constructed a plinth area of 230 sq.ft. That is in two items as mentioned below with boundaries and measurements.

A-SCHEDULE: The total an extent of 270 sq.yds. open site with boundaries and measurements.

East: 62.50" feats or 19.05 meters - The property belongs to the Y.V. Siva Rao, **West:** 62.50" feats or 19.05 meters - The house property belongs to the L.Kameswararao, **South:** 39.25" feats or 11.96 meters - The property belongs to the Nagampalli Sarweswara Rao, **North:** 38.50" feats or 11.74 meters - Subhan Saheb Street.

The total an extent of 270 sq.yards in the above measurements in a 22.50 sq.yards or 18.81 sq.meters un-divided and unspecified land and all easementary rights inclusive.

B-SCHEDULE: Description of the above A-Schedule in constructed a residential building by the name and style of PRIYANKA'S GRUHA APARTMENTS in a First Floor as a D.No.64-11/A/B4, Assessment No.1060023544 in Flat No.B.4, that was constructed 230 sq.ft. plinth area of Flat as following with boundaries and measurements.

East: Common corridor and Flat No.B-3, **West:** Open to sky, **North:** Open sky, **South:** Common corridor and Flat No.A-2 and Flat No.B-2.

Within the above boundaries and measurement of A and B Schedule total an extent of 22.50 sq.yds. site and plinth area of 230 sq.feet's B-Schedule RCC Roof House with all electrical fixtures, doors, doorways, electricity service connection, usual passages and all easementary rights inclusive.

REDDI ANNAVARAM, Advocate
D.No.1-17, Saibaba Temple Street, Gollapalem Village, Kajuluru Mandal, Kakinada Dist., Cell: 9553331888

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, పెద్దాపురం

ఓ.ఎస్. నెం. 214/2022

బిట్వీన్:

చంద్రు సత్యనారాయణ -వాది

మరియు

కానూరి రామలింగేశ్వరరావు -ప్రతివాది

టు:

ప్రతివాది: కానూరి రామలింగేశ్వరరావు, తండ్రి: వీరభద్రరావు, డో.నెం. 3-139, రాయభూపాలపట్నం గ్రామం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలో వాది ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం మీ మీద దాఖలు చేసిన దావాలో మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు దావా **ది. 05-03-2024వ సం॥రం తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల పై దావా తమ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గుణ్ణం రవికుమార్, అడ్వకేట్
మెయిన్‌రోడ్డు, సామర్లకోట

17-02-2024 సెల్:9676804050

మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు

H.M.O.P. No. 225/2022

బిట్వీన్:

కౌన్సు అలియాస్ సూరంపూడి కనకదుర్గ -వాది

మరియు

సూరంపూడి శ్రీనివాస్ -ప్రతివాది

టు:

ప్రతివాది: సూరంపూడి శ్రీనివాస్, తండ్రి: లక్ష్మీ స్వామి, వయస్సు 40 సం॥లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇంటి నెం. 4-65, రాలగంటి, రావులపాలెం మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

పైన తెలిపిన వాది మీ నుంచి విడాకులు పొందు నిమిత్తం పైన తెలిపిన న్యాయస్థానం యందు మీపై డైవర్స్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. అట్టి పిటిషన్‌లో మీకు పలుమార్లు కోర్టు హాజరు కావాల్సిందిగా నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నందున మీ హాజరు కొరకు **ది. 07-03-2024వ తేదీకి గౌరవ కోర్టు వారు వాయిదా వేసియున్నారు.** కావున ఆరోజు మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని జవాబు చెప్పుటకు పైన తెలిపిన న్యాయస్థానం యందు **ఉదయం 10.30 ని॥లకు** హాజరు కాగలరు. లేని యెడల మీకు పరోక్షంగా తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో)

జనపరెడ్డి గోపీకృష్ణ
న్యాయవాది, కొత్తగూడెం
కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
08-02-2024 సెల్: 9440144978

పురపాలక సంఘ కార్యాలయం, కొవ్వూరు

ఆర్.ఓ.సి. నెం. 10(2)/2024/ఇ1 తేది.17-02-2024

ఇ-ప్రొక్యూరుమెంట్ టెండరు నోటీసు

కొవ్వూరు పురపాలక సంఘ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో మొత్తము రూ. 30.84 లక్షల విలువ గల (5) పనులు చేయుటకు టెండర్లను ఇ-ప్రొక్యూరుమెంట్ ప్లాట్ ఫామ్ ద్వారా ప్రకటించబడినది. వివరములకు http://tender.e-procurement.gov.in దర్శించండి.

1) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు : తేది.19-02-2024 ఉదయం గం॥ 10.30ల నుండి
2) బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ముగింపు : తేది.05-03-2024న సాయంత్రం గం॥ 4.00 వరకు
3) టెండర్లు దాఖలు చేయుటకు ముగింపు : తేది.05-03-2024 సాయంత్రం గం॥ 4.30 వరకు
4) టెండర్లు తెరచుట : తేది.05-03-2024 సాయంత్రం గం॥ 6.00 నుండి

సం/- బి.శ్రీకాంత్
కమిషనరు,
కొవ్వూరు పురపాలక సంఘము